# పెద్ద మనుషులు

సాయంత్రం అయిదున్నర దాటి పోయింది. ఆఫీసునుంచి సరాసరివచ్చి గవర్నర్‌పేట సెంటర్ చేరుకున్నాను. సిటీ బస్సింకా రాలేదు. కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ, పక్కకి చూశాను. అక్కడ బస్సుకోసం నిలబడివున్న ప్రయాణీకుల్ని చూసేసరికి గుండె గుభేల్‌మంది. ఇంతమందిలోనూ, కనీసం బస్సెక్కడానికైనా అవకాశ ముంటుందా?—ఆలోచనల్తో మనస్సు సందిగ్ధావస్థలో పడి ఓ క్షణం కొట్టుమిట్టులాడింది.

ఫస్ట్‌పిరియడ్‌లో 'ఎకనామిక్స్' పరీక్ష వుండడంవల్ల, పొద్దుట్నుంచీ మనస్సంతా దానిమీదే వుంది. అదీగాక, ఆరు పదిహేను నిముషాలకే మాత్రం ఆలస్యంగా వెళ్ళినా, ఆబ్‌సెంట్ మార్క్ చేస్తారు—ఎటెండెన్స్ రిజిస్టర్‌లో. మనస్సు పరీక్ష గురించి కలవరిస్తోంటే, కళ్ళు బస్సుకోసం నిరీక్షిస్తున్నాయ్.

మరో రెండు నిముషాలవకముందే, రెండో నెంబరు బస్సొచ్చింది. ఆగిందే తడవుగా, అక్కడ నిలబడ్డ జనమంతా 'పోలో'మంటూ ముందుకు చొచ్చుకవచ్చి, దిగేవార్ని దిగనియ్యకుండానే ద్వారాన్ని చుట్టుముట్టేశారు. కండక్టర్ గొంతుచించుకొని అరుస్తోన్నా, ఎవరూ లక్ష్యపెడుతున్నట్లు లేదు. అది దాటిపోతే, మరో యిరవై నిముషాలగ్గానీ యింకో బస్సురాదు. ఏమైతే అయింది - సాహసించాలనుకున్నాను. జనాన్ని తప్పించుకొని అతి కష్టంమీద లోపలికి జొరబడి, ద్వారపు చువ్వలు పట్టుకొని, కుడికాలు మెట్లమీద మోపాను. నా ముందెక్కే వారంతా ఆడవారవడం వల్ల, వారు లోపలికెళ్ళందే, నాకు దారేర్పడేటట్లు లేదు. ఏం చేయను? ఆలోచిస్తూండగానే, కండక్టర్ 'రైట్' చెప్పేశాడు. "ఏమమ్మో! బస్సు కదుల్తుంది దయచేసి త్వరగా లోపలికెల్తారా?" అంటూ, నా ముందున్నవార్ని, హెచ్చరించి, నేను సర్దుకోబోయేంతలో, నా షర్టు పట్టుకొని, ఎవరో వెనక్కి గుంజారు. దాన్తో, ఒక్కూకువున, బేలన్స్ తప్పి, కిందికి తూలిపోయాను. చేతిలోని పుస్తకాలు జారిపోయాయి. బస్సు కదిలింది.

"ఎందుకబ్బాయ్ ఆ తొందరపాటు! అంతమంది ఆడకూతుళ్లెక్కుతుండగా, తోసుకుపోవడమేనా? పైగా చదువుకుంటున్నావు. కొంచెమన్నా మంచీ, మర్యాద తెలీకపోతే ఎట్లా?"

పడిపోయిన పుస్తకాల్ని చేతులోకి

తీసుకొని, కోపంతో తిరిగిచూశాను. ఏభై ఏళ్ళుంటాయతనికి. గ్లాస్కో పంచెమీద సిల్కుచొక్కా వేసుకొని కుడి చేతిలో వ్రేలాడుతోన్న బ్లూ కలర్‌సంచితో, రిమ్‌లెస్ తెల్ల కళ్ళద్దాలు పెట్టుకొని ఫక్తు 'పెద్దమనిషి' లా వున్నాడు. కొరకొరలాడుతోన్న అతనిచూపులు నామీదే వున్నాయ్. దాన్తో, నన్ను వెనక్కి గుంజింది అతనేనని గ్రహించాను. శరీరం కుతకుత లాడింది నాకు, అమాంతంగా మింగేయాలన్నంత కోపం వచ్చేసింది. "నీ కెందుకుపోవయ్యా!" అందామనుకొని నోరుతెరచి, "ఎందుకులే, ఏదో పెద్దమనిషిగదా" అని "పరీక్షలండీ" అన్నాను నిర్లిప్తంగా ముఖాన్ని పక్కకు తిప్పుకుంటూ.

"పరీక్షలైతే రిక్షా కట్టించుక వెళ్ళాలి. అంతేగాని, అందర్నీ అలా తోసుకుపోతే ఎట్లా?" మందలిస్తూ బుద్ధిచెప్తున్నట్లుందతని ధోరణి. ఈసారి నిజంగానే కోపం, కళ్ళమొయ్యొచ్చేసింది నాకు. జేబులు తడిమి చూసుకున్నాను. పన్నెండు పైసలుమాత్ర మున్నాయి.

"ఆఁ! ఏం చదువులు పోనిద్దురూ! అవి పెరిగినకొద్దీ సంస్కారం ఇలా మండిపోతోంది."

వెన్నుమీద ఛెళ్ళున చరిచినట్టయింది. చట్ మని దృష్టినిమరల్చాను. ఆ పెద్దమనిషే! పక్కగా నిలబడ్డ మరో బట్టతల ఆసామితో అంటున్నాడు. ఆ మాటలు నన్నుద్దేశించి అన్నవే నని యిట్టే గ్రహించాను. బస్సెక్కనియ్యకుండా చేసిందేగాక పరోక్షపు విమర్శ కొంతా? హృదయం భగ్గుమంది.

"మా బాగా చెప్పారు" అంటూ బట్టతల ఆసామీ మొదలెట్టాడు. "సంస్కారమూ, సభ్యతా అన్నవి చదువుకున్నంత మాత్రాన అబ్బుతాయటండీ! అవసలు పుట్టుకతో కదుటండీ రావాలి! అందుకే పాశ్చాత్యులు రోజురోజుకీ ముందుకు పోతోంటే, మనం వెనక్కి జారిపోతోన్నాం. ఏమం



ద్వితీయ బహుమతి

రూ. 25

## భీశెట్టి లక్ష్మణరావు

బి. యు. సి.
యస్. ఆర్. ఆర్. అండ్
సి. వి. ఆర్, కాలేజి,
మాచవరం
విజయవాడ - 4.

టూరు ?' అన్నాడు — బట్టతలను కు డి చే త్తో సవరించుకుంటూనే, చుట్టూ ఓ పోజు పారేశాడు; తన మాటలు అందరూ వింటున్నారో లేదోనని.

'మె ల్ల గా అంటారేంటండీ. చూశారూ...' అంటూ ఏదో చెప్ప డానికి నోరు తెరిచాడో లేదో, అప్పుడే బురద నీటిలో స్నానమాచ రించి గాబోలు బయటి కొచ్చిన ఓ పిల్లకారు 'వరహావతారం' పెద్ద మనిషి వెనగ్గాపోతూ, ఓ చిన్న డేష్ యిచ్చి మరీ పోయింది.

దాన్తో అతను చిందులు తొక్కడం మొదలెట్టాడు. 'ఛ ఛ! ఈ పందుల్తో మహా బెడదొచ్చి పడింది. ఊరే చిన్న చిన్న సందులైతే, ఆ సందు ల్నిండా యీ పందులు కొంత అసలీ వూర్లో మున్సిపాలిటీ అన్నది వుందో లేదో కూడా తెలీదు' కోపంతో చిరబురలాడుతూ, సణు క్కుంటూ, పంచె కంటుకున్న మురి కిని తుడుచుకుంటూ అన్నాడు.

బస్సెక్కనియ్యకుండా చేసిన పనికి, బలేశాస్తి జరిగిందిలే అను కున్నాను నేను—మనసులో.

'అబ్బెబ్బే! మీరు పొరబడు తున్నట్టున్నారు. అ స లు 'పంది' పరమాత్మునికి మారుపేరు కాదు టండీ! అదీగాక, మున్సిపాలిటీ వారికి, ఆపద్బంధువాయే మరి. ఎం చే తం టే, రోడ్ల సైడ్లను కాలవగట్లను శుభ్రపర్చాలంటే, మున్సిపాలిటీ వారికి కొంత అదనపు సిబ్బంది అవసరమాయె! ఆ అవసరం లేకుండా, యివి వుపయోగపడు తున్నాయ్ గదా !' అన్నాడు బట్టతల వ్యక్తి పళ్ళికిలిస్తూ.

'బ్రహ్మాండంగా వ్యాఖ్యానించా వు బాబూ' అనుకున్నాను మన సులో - పక్కనుంచి వి ం టు న్న నేను.

'మా బాగా సెలవిచ్చారు. విదే శాల్లో చూడండి. ప ట్ట ణా లు, ప ల్లె లూ, వీ ధు లూ ఎంత పరి శుభ్రంగా, అందంగా వుంటాయో' అంటూ స్వయంగా చూచివచ్చినట్టు టకటక వల్లించేశా డో రెండు నిము షాలు పెద్దమనిషి.

ఇ ద్ద రూ లోకాభిరామాయణం మొదలెట్టారు.

పెద్దమనిషి చెప్పేది సొంతంగా బట్టతల మనిషి వినడంలేదు బట్టతల మనిషి చెప్పేది పెద్దమనిషి వినడం లేదు. ఇద్దరి కిద్దరూ ఒకరి కొకరు ఏ మాత్రంతీసిపోకుండా ఏమిటేమిటో చెప్పుకపోతున్నారు. పాక్ చైనాల దు రా క్ర మ ణ ను గురించి చెప్తున్న పెద్దమనిషి, తక్కున దాన్నే పేసేసి, తన వూరి పంచాయితీ వ్యవస్థను

గూర్చి చెప్పటం మొదలెట్టాడు. అది పూర్తవకముందే, దారినపోతున్న ఒక ఆంగ్లో ఇండియన్ యువతిని చూసిన బట్టతల మనిషి, నాగరికత అంటే ఏమిటో చెప్తూ విమర్శించడం మొదలెట్టాడు.

ఇలా మహా ప్రవాహంలా సాగిపోతోన్న వాళ్ళిద్దరి సంభాషణ, అమెరికా గురించి చెప్పుకుంటూ, అనకాపల్లిని వర్ణిస్తున్నట్టుగా వుంది. పక్కన నిలబడ్డమనుష్యులువింటున్నట్టు కూడా వారు గ్రహించినట్టులేదు.

ఇంతలో పెద్దశబ్దం చేసుకుంటూ బస్సొచ్చింది. చూస్తే అదికూడా కిక్కిరిసేవుంది. అందరికంటే ముందుగా, గబగబా నడిచివెళ్ళాను. కండక్టర్‌కి పక్కగా నిలబడ్డాను. లోపలివారు దిగేసినతర్వాత, పైకెక్కడం కోసం చువ్వలు పట్టుకున్నాడు.

"అంతతొందరైతే ఏలా! వుండబ్బాయ్!" అంటూ ముందు 'పెద్ద మనిషి', వెనుక బట్టతల మనిషీ, గబగబావచ్చి నన్ను పక్కకి నెట్టిమరో బస్సెక్కేశారు. నిర్ఘాంతపోయి చూస్తూ ఉండిపోయాన్నేను.

[రచయిత సాయంత్రపు కళాశాల విద్యార్థిగా గమనింప మనవి.]

□□□

